క్లుప్తంగా

ప్రజలతో మమేకమైతేనే ఆదరణ: రాజీవ్ గుంభార్

కాచిగూడ: బీజేపీ ప్రవాస్ యోజనలో భాగంగా బుధవారం కాచిగూడ డివిజన్ శ్యామ్‌మందిర్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాజీవ్ గుంభార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీశ్యామ్‌బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గుంభార్ మాట్లాడుతూ... ఈ మూడు నెలల పూర్తి సమయం పార్టీకి కేటాయించి ఒక్కొక్క నాయకుడు 100 ఓట్లు పోలింగ్ బూత్‌లలో వేయించాలన్నారు. ప్రజల కోసం సేవ చేసి అందుబాటులోఉండే నాయకులతోనే సమాజానికి ఉపయోగం ఉంటుందన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ... ప్రతి డివిజన్‌లో ప్రతి బూత్‌లో బలమైన నాయకత్వం ఉండాలని అన్నారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, పార్టీ నేతలు కన్నె రమేష్ యాదవ్, శ్యామ్‌రాజ్, రామ్‌దేవ్ అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, కృష్ణ కుమార్, సుభాష్ పటేల్ పాల్గొన్నారు.

మంత్రి తలసానికి అభినందన



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మరో సారి సనత్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా టికెట్ సాధించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం బాగ్‌లింగంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో పలువురు నేతలు మంత్రిని కలిసి పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. నాయకులు వెంకటేష్, మహేష్, హరినాథ్, సుధ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 దేశానికే గర్వకారణం

చిక్కడపల్లి: చంద్రుని దక్షణ ధ్రువంపై అడుగు పెట్టిన మొదటి దేశంగా భారత దేశం చరిత్ర సృష్టించిన క్షణం ప్రతి భారతీయనికి గర్వకారణం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి గాంధీనగర్‌లో ఆమె మాట్లాడుతూ... చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3ని విజయవంతంగా ల్యాండింగ్ చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: సామాజిక సేవా కార్యక్రమాలలో నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ప్రాధాన్యం ఇస్తుందని మాజీ కార్పొరేటర్, నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సిద్దిక్‌నగర్‌లోని అబ్దుల్ కలాం, రెయిన్‌బో హోం లర్నింగ్ సెంటర్‌లలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సిరిగిరి శ్యామ్, కార్తీక్‌యాదవ్, నేత శ్రీనివాస్, కిరణ్, సత్యనారాయణ, ఎస్సార్‌డీ సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇందిరా భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు నివాళి

కాచిగూడ: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసెంబ్లీ ఎదురుగా ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నేతలు దేశాయ్, మంగపతిరావు, టంగుటూరి శ్రీరామ్, అరుణాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం: బీజేపీ

ముషీరాబాద్: గత ఎన్నికల సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యారని మళ్లీ మాయమాటలతో, అమలు కాని హామీలతో గద్దెనెక్కేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రామ్ విమర్శించారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు, పింఛన్‌లు అందజేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాంనగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులకు అడ్డంగా పడుకోని రాకపోకలకు అంతరాయం కలిగించి ధర్నా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు భరత్‌గౌడ్, పార్థసారధి, వినయ్‌కుమార్, నరేష్, అరుణ్‌కుమార్, లక్ష్మణ్, గడ్డం నవీన్, చారి, వెంకటేష్, రమేష్, లక్ష్మీనారాయణ, జగదీష్, రాజ్‌కుమార్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

- చంద్రయాన్-3 విజయవంతం కావడంతో మిన్నంటిన సంబరాలు
- భారత్ సత్తాను ప్రపంచానికి చాటిన ఇస్రో
- శాస్త్రవేత్తలకు అభినందన వెల్లువ
- మిఠాయిలు పంచి.. బాణసంచా కాల్చి వేడుకలు

ముషీరాబాద్: చంద్రయాన్-3 చంద్రమండలంపై సురక్షితంగా ల్యాండ్ కావడం పట్ల ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగు పెట్టిన మొదటి దేశం రష్యా విఫలమైన చోట భారత్ విజయ భావుట ఎగుర వేసి మొదటి దేశంగా కీర్తికి ఎక్కిందని పలువురు అభిప్రాయపడ్డారు. అంతరిక్షంలో భారతదేశం కొత్త చరిత్రను లిఖించిందని కొనియాడారు. ఇస్రో శాస్త్రవేత్తల నాలుగు సంవత్సరాల కఠోర శ్రమ, 41 రోజుల ప్రయాణం దశాబ్దాల కల నెరవేరిందని తెలిపారు. ప్రపంచం మొత్తం ఇపుడు భారతదేశం అంతరిక్షం వైపు చూస్తుందన్నారు. ఆర్‌టీసీ క్రాస్ రోడ్, రాంనగర్ చౌరస్తా, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో చంద్రుడిపై ల్యాండర్ సురక్షితంగా దిగిన వెంటనే జాతీయ జెండాలను చేతబూని మిఠాయిలు పంచుతూ భారత్ మాతాకి జై అంటూ సంబురాలు జరుపుకొన్నారు.



బర్కత్‌పురాలో మిఠాయిలు పంచుతున్న బీజేపీ నేత సూర్యప్రకాష్ సింగ్ తదితరులు

అంబర్‌పేట: ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం సాయంత్రం చంద్రయాన్ విజయవంతంగా చంద్రుడిపై కాలిడడంతో జైస్వాల్ గార్డెన్‌లో ప్రజలు జాతీయ జెండాలను చేతబట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఒకరికి ఒకరు మిఠాయిలు పంచుకుని సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, కాలనీ ప్రతినిధులు రామాగౌడ్, జి.ప్రసన్నాంజనేయులు, రమేష్‌గౌడ్, స్వామిగౌడ్, ఎం.ప్రవీణ్‌కుమార్, సి.హెచ్.ఇంద్రసేన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పురాలో...

కాచిగూడ: చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ సూపర్ సక్సెస్ సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బర్కత్‌పురాలో ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చంద్రయాన్-3 విజయవంతమైన క్షణాలు దేశం గర్వించే మహత్తర క్షణాలని అభివర్ణించారు. ఈ ప్రయోగం సక్సెస్‌తో దేశ ప్రజలందరూ వేడుకలు జరుపుకొంటున్నారన్నారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు అరవింద్, బల్వీర్, సురేష్, శ్రీధర్, సత్యేందర్ సింగ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.





ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లో బీజేవైఎం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో సంబరాలు



రాంనగర్ గుండు వద్ద మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకొంటున్న స్థానికులు



టీవీలకు అతక్కుపోయి ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న దృశ్యం



రాంనగర్‌లోని కాకతీయ స్కూల్‌లో...

కాంగ్రెస్, బీజేపీలకు దమ్ముంటే... వారం రోజుల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించాలి

రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కాచిగూడ: కాంగ్రెస్, బీజేపీ నేతలకు దమ్ముంటే వారం రోజుల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయా పార్టీల నేతలకు సవాల్ చేశారు. బుధవారం కాచిగూడలోని తుల్జాభవన్‌లో అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో బీసీ కులవృత్తి దారులకు ప్రభుత్వం మంజూరు చేసిన లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... దమ్మున్న మా నాయకుడు, ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్‌రావు ఎన్నికల నోటిఫికేషన్‌కు చాలా ముందే ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారని గుర్తు చేశారు. బీజేపీకి అభ్యర్థులు లేరని.. కాంగ్రెస్ పార్టీ కుమ్ములాటలకే పరిమితమైందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెప్పే ధైర్యం మాకుందని, ఏం చేశారో చెప్పే ధైర్యం మీకు ఉందా అని ప్రశ్నించారు. అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలకు విశ్వాసం లేదని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయని, ప్రజలు తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఏర్పాటుకు పట్టం కడతారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ అధికారి ఆశన్న హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, రజిత, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే వెంకటేష్, జిల్లా కలెక్టర్ అనుదీప్

మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయండి

ముషీరాబాద్: హైదరాబాద్ నగరంలో ఈ నెల చివరివారంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మందకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మహాజన సోషలిస్టు పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్ పరిధిలోని చిత్రాల నగర్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణపై ప్రధాని నరేంద్ర మోడీ హామీని నిలబెట్టుకోవాలన్నారు. నరేంద్ర మోడీ ఈ మహాసభను మాదిగ, మాదిగ ఉపకులాలతో కలిసి దాదాపు 30 లక్షల మందితో భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ జున్ను రవి, సీనియర్ నాయకులు సామేల్ మాదిగ, దుర్గాప్రసాద్ మాదిగ, చిలుక ఎల్లయ్య, శ్యామ్‌రావు, తాండ్ర మురళి, హిందూరి నరేష్, బస్తీ అధ్యక్షుడు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకుమార్ మాదిగ

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



చిక్కడపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ ముషీరాబాద్ అభ్యర్థిగా మూడవసారి ఎమ్మెల్యే ముఠాగోపాల్ పేరును ప్రకటించం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చిక్కడపల్లి గంగపుత్ర(బెస్త) సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆ సంఘం కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుండు జగదీశ్‌బాబు మాట్లాడుతూ గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన ముఠాగోపాల్‌కు అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయం అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి గంగపుత్రులు అండగా ఉంటామన్నారు. మరోసారి ముఠా గోపాల్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేష్, సలహాదారు బంగారు సంపత్‌కుమార్, నాయకులు వినోద్, యాదగిరి, నర్సింగ్‌రావు, దయానంద్, వెంకటేశ్, రాజు, పెద్దపల్లి సుజాత, భాగ్య సుమలత, పద్మప్రియ, పద్మభారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఉమెన్ సేఫ్టీ వింగ్ శిఖా గోయల్

కాచిగూడ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఉమెన్ సేఫ్టీ వింగ్ శిఖా గోయల్ అన్నారు. తెలంగాణ యువతి మండలి, ఎ.శ్యామలాదేవి మహిళా డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా బుధవారం బర్కత్‌పురలోని కళాశాల అడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు చక్కగా చదువుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళితే తప్పక విజయం వరిస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుండాలని సూచించారు. ఉన్నత స్థానాల్లో స్థిరపడి దేశ ఖ్యాతిని చాటిచెప్పాలని పేర్కొన్నారు. కాలానుగుణంగా విద్యార్థుల ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వశక్తితో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఉన్నత విద్యాను అభ్యసించే విద్యార్థుల్లో విలువలు ముఖ్యమన్నారు. సమాజానికి ఉపయోగ పడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యాలపై ఉందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నుంచి విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం పోటీ ఎక్కువగా ఉందని, దానిని తట్టుకొని నిలబడగలిగే మానసిక దృఢత్వాన్ని ప్రతి విద్యార్థి పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నతంగా రాణించగలరని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు శేషు విఠల్, ఉపాధ్యక్షురాలు ఆర్.పద్మజ మల్లికార్జున్, కార్యదర్శి నివేదిత కుమార్, కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు నిరంతర ప్రక్రియ

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

ముషీరాబాద్: బీసీ బంధు నిరంతర ప్రక్రియ అని ప్రతి నియోజకవర్గంలో మొదటి విడుత 300 మందికి లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బీసీ బంధు రానివారు బాధపడవద్దని రెండవ విడుత వారికి కూడా వస్తాయని సూచించారు. బుధవారం ముషీరాబాద్‌లోని కశిష్ ఫంక్షన్ హాల్‌లో 300ల మందికి బీసీ బంధు పథకం చెక్కులను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తలసాని, ఎమ్మెల్యే ముఠా గోపాల్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి బీసీ బంధు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం తలసాని మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాలను ప్రవేశపెట్టి పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక రుణాలు అందజేస్తూ వారి జీవనోపాధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం నుంచి స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి ఏకాణా కూడా తేలేదని విమర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలతో ప్రజలు బాధపడుతుంటే కిషన్‌రెడ్డి స్థానిక ప్రాంతాలలో పర్యటించలేదని ఆరోపించారు. వరదనీటి నాలా ముంపు ప్రాంత ప్రజలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ చెప్పి రూ. 50 కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... నాలుగున్నర ఏళ్లలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. మరోసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీకు అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ఆరు డివిజన్ల బీఆర్‌ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, నర్సింగ్‌ప్రసాద్, వల్లాల శ్యామ్‌యాదవ్, రాకేష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మోజెస్, ముషీరాబాద్ తహసీల్దార్ వెంకటలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆశన్న, బీఆర్‌ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శివముదిరాజ్, శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

ప్రొటోకాల్ పాటించలేదని బీజేపీ కార్పొరేటర్ల నిరసన...

ప్రభుత్వం అధికారికంగా నిర్వహిచిన బీసీ బంధు పథకం చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఆరోపిస్తూ బీజేపీ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రాకముందే చెక్కుల పంపిణీ వేదిక వద్దకు వచ్చి బీజేపీ కార్పొరేటర్లు సుప్రియనవీన్‌గౌడ్, రవి చారి, పావని వినయ్‌కుమార్, రచనశ్రీలు నిరసన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీబోర్డుపై తమ ఫోటోలు లేవని, బీజేపీ కార్పొరేటర్లు అయినందువల్లే తమ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. తమకు సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వేదిక వద్ద ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు కార్పొరేటర్లకు అడ్డుతగలడంతో స్వల్ప గొడవ జరిగింది. చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్‌లు కార్పొరేటర్లకు సర్దిచెప్పే క్రమంలో బీజేపీ కార్పొరేటర్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నందుకు తామే ఈ కార్యక్రమాన్ని బైకట్ చేస్తున్నామని బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వేధిక వద్ద నుంచి బయటకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జితో ఉత్పన్నయ్యే సమస్యలను పరిష్కరించాలి

గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: స్టీల్ బ్రిడ్జి వల్ల ప్రజలు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేయర్ గద్వాల విజ్యలక్ష్మిని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... స్టీల్ బ్రిడ్జి ప్రారంభమై నాలుగు రోజులు అయినా స్థానికులు, వ్యాపారులు అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పాదచారులకు 6 చోట్ల యుటర్న్ కోరుతూ అనేక సార్లు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని సమర్పించామన్నారు. నాలుగు మాత్రమే యుటర్న్‌లు ఏర్పాటు చేశారని ఆమె వివరించారు. అసలు బ్రిడ్జి అవసరమే లేని చోట కేవలం కమిషన్లు దండుకోవడానికి స్టీల్ బ్రిడ్జిని నిర్మించారని ఆమె ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతినిస్తే మరో రెండు యుటర్న్‌లు ఏర్పాటు చేయడానికి తమకు ఇబ్బంది లేదని ట్రాఫిక్ పోలీస్ శాఖ వారు తమకు వివరించినట్లు తెలిపారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూన్న కార్పొరేటర్ పావని

సంక్షేమ పథకాల అమలులో విఫలం: బీజేపీ



గౌతమ్‌రావును అరెస్టు చేస్తున్న పోలీసులు

అంబర్‌పేట: సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నిరంకుశ తత్వాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. బుధవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు బీజేపీ నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు మాట్లాడుతూ... అంబర్‌పేట నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అర్హులైనవారికి అందించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, దళితబంధు, బీసీబంధు, వంటి పథకాలు అర్హులకు అందడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ బి.వెంకట్‌రెడ్డి, నాయకులు వనం రమేష్, అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్, రమేష్‌యాదవ్ భూషణ్‌చారి, చుక్క జగన్ తదితరులు ఉన్నారు.

బీసీలు, మహిళలకు అన్యాయం

కాచిగూడ: త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సీట్ల కేటాయింపులో బీసీలు, మహిళలకు అన్యాయం జరిగిందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ ఆరోపించారు. బుధవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు 50 శాతం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ బీసీలకు కేవలం 22 సీట్లను మాత్రమే ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. టికెట్ల కేటాయింపులో అగ్రకులాలలకు పెద్ద పీటను వేశారన్నారు. ఎన్నికలలో తమను విస్మరించే పార్టీలను బీసీలు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నేతలు భూషణ్ భాస్కర్, సిహెచ్ ప్రదీప్‌గౌడ్, నల్లెల కిషోర్ గౌడ్, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, పులిజాల కృష్ణ ధరణీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరాలి

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తతంగా ప్రచారం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ పిలుపునిచ్చారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కమిటీ సమావేశం బుధవారం జవహర్‌నగర్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ... ప్రతి నాయకుడు, కార్యకర్తల బీఆర్‌ఎస్ పార్టీల మరింత పటిష్ఠ పరిచే విధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేష్, ముఠానరేశ్, పున్న రాజ్‌మోహన్, శ్రీనివాస్‌గుప్తా, గుండు జగదీశ్‌బాబు, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, శ్రీను, గడ్డమీది శ్రీనివాస్, తుడుం లక్ష్మీ, అరుణశ్రీ, శివకుమారి, జహంగీర్, శ్రీధర్‌రెడ్డి, సాయిచాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చంద్రయాన్ మ్యూజిక్ ఫెస్ట్

చిక్కడపల్లి: ఇన్ ఫ్యూజన్ సంస్థ, బి.వరలక్ష్మి మేధాన్ మెలోడీస్, స్నేహ హసంతి శౌర్యమ్యూజిక్ ఎంటర్ టైన్‌మెంట్‌సంస్థల ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్‌లో ఆర్‌ఐఎఫ్ చంద్రయాన్ మ్యూజిక్ ఫెస్ట్ శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరి బుధవారం సాయంత్రం అలరించింది. గాయనీ గాయకులు చందమామ, జాబిల్లిపై పాటలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. చంద్రయాన్-3 విజయంతం కావడంతో జయహో భారత్... జైహో భారత్ అంటున్న గాయనీ గాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు కళ్యాణిదేశ్‌పాండే, శరత్‌చంద్ర, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గీతాన్ని ఆలపిస్తున్న గాయనీ గాయకులు

కాంగ్రెస్ టికెట్ కోసం రోహిత్ దరఖాస్తు

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ హైదరాబాద్ నగర అధ్యక్షుడు మోత రోహిత్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. బుధవారం నల్లకుంట టీఆర్టీ కాలనీ నుంచి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి రోహిత్ గాంధీ భవన్‌ను ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ టీ పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎ.భాస్కర్‌లను కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ దరఖాస్తును అందజేశారు.